క్లుప్తంగా

సేవాగుణం అలవర్చుకోవాలి



విద్యార్థులకు రగ్గులు అందజేస్తున్న రోజారమణి, తదితరులు

గంట్యాడ: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చు కోవాలని విశాఖపట్నానికి చెందిన హెచ్ఎస్ ఫౌండేషన్ చైర్ పర్సన్ రోజా రమణి సూచించారు. మండలంలోని చినమధుపాడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం రగ్గులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ కార్యదర్శి మూర్తి, పాఠశాల హెచ్ఎం బంకపల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజినిగిరిలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి

జామి: మండలంలోని విజినిగిరి గ్రామంలో జామి పీహెచ్‌సీ వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వ హించారు. శిబిరానికి వచ్చిన గ్రామస్తులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.30 ఏళ్లు దాటిన వారు క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వేడినీటిని తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

29న పీఆర్టీయూ సదస్సు



మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడురాంబాబు

మెరకముడిదాం: పీఆర్టీయూ ఉత్తరాంధ్ర సదస్సును జిల్లా కేంద్రంలోని తోటపాలెం ప్రాంతంలో గల సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 29న నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు తెలిపారు. మండలంలోని గరుగుబిల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో గురువారం ఆయన సమావేశమయ్యా రు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న సదస్సుకు ఉపాధ్యాయులు అంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్య క్షుడు మిట్ట కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణానిధి, తదితరులు హాజరవుతారని చెప్పారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఆర్.సింహాద్రి, సభ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జియో' రామకృష్ణకు అవార్డు



అతిథుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న'జియో' రామకృష్ణ

శృంగవరపుకోట: మూడు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న 'జియో' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణకు ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్ పురస్కారం దక్కింది. విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా రామకృష్ణకు అవార్డు అందజేశారు. విశాఖలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, విశ్రాంత కమిషనర్ చదలవాడ హరిబాబు, వి-11 ఛానల్ చైర్‌పర్సన్ దీపిక గుణకుల, మా వ్యవస్థాపకులు ఏ.ఎం.ప్రసాద్, దర్శకుడు డాక్టర్ మణిభూషణ్‌కుమార్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా..?

దత్తిరాజేరు: గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని పాచలవలస సర్పంచ్ సుమల శ్యామల ప్రశ్నించారు. సాక్షితో ఆమె మాట్లాడుతూ పాచలవలసలో అధికారులు గురువారం గ్రామ సందర్శన పేరుతో ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారని చెప్పారు. కార్యక్రమానికి సర్పంచ్ అయిన తనను అధికారులు ఆహ్వానించలేదని, కనీస సమాచారం ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని అధికారులు అత్యుత్సాహంతో టీడీపీ కార్యక్రమంలా మార్చేశారని మండిపడ్డారు. మా గ్రామంలో జరిగే కార్యక్రమానికి సర్పంచ్ అయిన తనని కాదని, పక్క గ్రామాల టీడీపీ నాయ కులను ఆహ్వానించాల్సిన అవసరం అధికారులకు ఏమొచ్చిందని ప్రశ్నించారు. సర్పంచ్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా అని నిలదీశారు. అలాగే ఆర్బీకే భవనంలో అందించే సచివాలయ సేవలను తమకు తెలియజేయకుండానే వెల్‌నెస్ సెంటర్‌లోకి మార్చడం తనని అగౌరవపరచడంగానే భావిస్తున్నానని అన్నారు. అన్ని విషయాలపై జిల్లా కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

దేవుడితో రాజకీయాలు చేసే దౌర్భాగ్య నేత చంద్రబాబు

- తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన మహానుభావుడు
- చంద్రబాబు చేసిన అపచారాన్ని మన్నించాలని కోరుతూ..
- ఈనెల 28న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: రాజకీయాల్లో తన స్వప్రయోజనం కోసం ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అవే ప్రయోజనాల కోసం చివరకు ప్రపంచ దేశాల్లో ఎంతో పవిత్రంగా భావించే తిరుపతి వేంకటేశ్వరస్వామిని సైతం విడిచిపెట్టలేదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం ఆరోపించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు అవశేషాలు కలిపారంటూ సీఎం చంద్రబాబు ఆరోపణలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. రాజకీయాలు చేయడానికి ఎన్నో అంశాలు ఉంటాయని, తిరుపతి లడ్డూపై కూడా చంద్రబాబు రాజకీయాలు చేయడం దౌర్భాగ్యం, బాధాకరమని అన్నారు. చంద్రబాబు చేసిన అపచారానికి మన్నించుస్వామీ అని కోరుతూ మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ సూచనలతో ఈనెల 28న చీపురుపల్లి పట్టణంలోని ఆంజనేయపురం వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పతివాడ రాజారావు, నాయకులు పనస అప్పారావు, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, కరణం ఆది, కర్రోతు ప్రసాద్, రేవల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నిలదీత



మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో విద్యుత్ శాఖ సిబ్బంది విఫలమయ్యారని విద్యుత్‌శాఖ ఏఈ శంకరరావుపై బి.రాజేరు, కొండకిండాం పంచాయతీల సర్పంచ్‌లు ఈదుబిల్లి కృష్ణ, బుంగ దేవుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్య క్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను సభకు చదివి వినిపించగా...సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇసుక కొరత కారణంగా గృహనిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని, ఇసుక సరఫరా చేసేలా చూడాలని వేంద్రాం సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు అధికారులను కోరారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామసభల్లో తీర్మానం చేసిన పనులన్నీ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన ఎస్ఐ కె.లక్ష్మణరావు

గజపతినగరం: మండలంలోని శ్రీరంగ రాజపురం, సీతారామ పురం గ్రామాలకు చెందిన మూడు ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి 2గంటలకు చంపావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పై రెండు గ్రామాలకు చెందిన మూడు ట్రాక్టర్‌లను, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు గురువారం సాయంత్రం విలేకరులకు తెలిపారు.

విద్యార్థినులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఆస్పత్రిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: కలుషిత ఆహారంతిని అస్వస్థతకు గురై ఎస్.కోట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం విద్యార్థినులను మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గురువారం పరామర్శించా రు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్ ఎలా జరిగింది, హాస్టళ్లలో ఎటువంటి పరిస్థితులు ఉన్నాయి, మౌలిక సదుపాయా లు, తదితర అంశాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందుతుందని విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. తక్షణం ఎస్.కోట పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్య లు తీసుకోవాలని, వసతి గృహాల పరిసరాలను శుభ్రం చేయించి, క్లోరినేషన్, శానిటేషన్, వాక్సినేషన్ చేయించాలని, ప్రతీ వసతి గృహంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెనూ అమలయ్యేలా, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, వి.రాంబాబు, సర్పంచ్‌లు కె.వెంకటరావు, జుత్తాడ సూర్యారావు, ఎం.సోంబాబు, కె.సత్యం, ఎం.పురుషోత్తంనాయుడు, రంధి అనంత్, ఎంపీటీసీ అప్పయ్య, వార్డు మెంబర్ ఎం.శేఖర్, కె.జయశంకర్, కె.రంగ, మోపాడ కృష్ణ, పరమేశ్ ఉన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



శృంగవరపుకోట: మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు హాజరైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



గంట్యాడ: పెదవేమలిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ భవాని



దత్తిరాజేరు: మరడాంలో పోటీలను ప్రారంభిస్తున్న హెచ్ఎం బంగార్రాజు

శృంగవరపుకోట: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఎంఈఓ పి.గణపతిలక్ష్మి అన్నారు. పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాల మైదానంలో గురువా రం నిర్వహించిన మండలస్థాయి అండర్-14,17 స్కూల్‌గేమ్స్ పోటీలను ఆమె ప్రారం భించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో ఇస్తున్న సర్టిఫికెట్ల వల్ల భవిష్యత్‌లో చదువుల్లో, ఉద్యోగాల్లో 2శాతం రిజర్వేషన్ దక్కుతుందన్నారు. మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పి.శ్రీరాములు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 280 మంది క్రీడాకారులు కబడ్డీ, వాలీ బాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగ, అథ్లెటిక్స్, చెస్ పోటీల్లో పోటీ పడుతున్నారని, విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఎస్.కోట మండలానికి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

దత్తిరాజేరు: చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని మరడాం ఉన్నత పాఠశాల హెచ్ఎం బంగార్రాజు అన్నారు. రెండు రోజుల పా టు నిర్వహించనున్న మండలస్థాయి అండర్-14,17 స్కూల్ గేమ్స్ పోటీలను పాఠశాల మైదానంలో గురువారం ఆయన ప్రారం భించారు. వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింట న్, యోగ, అథ్లెటిక్స్, చెస్, కబడ్డీ తదితర పోటీల్లో పది పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు తలపడుతున్నారని చెప్పారు.

చదువు, క్రీడలకు సమప్రాధాన్యం

గంట్యాడ: చదువుతో పాటు, క్రీడలకు విద్యార్థులు సమప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని అన్నారు. పెదవేమలి ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి అండర్-14, 17 స్కూల్ గేమ్స్ పోటీలను గురు వారం ఆమె ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటల ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. ఎంఈఓ-2 చలుమూరి వెంకటరావు, హెచ్ఎం ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ చప్ప నారంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖలో అక్రమాలు

చీపురుపల్లి: పౌరసరఫరాలశాఖలో చాలా అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని బయటకు తీస్తానని పౌరసరఫరాలశాఖ రాష్ట్ర కార్పొరేషన్ మెంబర్ గద్దే బాబూరావు తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ చేపడుతున్న బియ్యం సరఫరా, ధాన్యం సేకరణలో జరుగుతున్న కుంభకోణాలు బయటకు తీస్తానన్నారు. రేషన్‌కార్డు లబ్ధిదారులకు సరఫరా చేస్తున్న బియ్యం పక్కదోవ పట్టి తిరిగి రైస్ మిల్లులకు చేరుతున్నాయని అన్నారు. రైస్ మిల్లుల్లో అవే బియ్యం రీసైక్లింగ్ చేసి తిరిగి మార్కెట్‌లో విక్రయించుకుంటున్నారని చెప్పారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో అవకతవకలు జరగకుండా చూస్తామని తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీలో లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వాహనాల కోసం ఎదురు చూడాల్సి వస్తోందన్నారు.

పరామర్శ



పడాల అరుణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: మాజీ మంత్రి, నియోజకవర్గ జనసేన నాయకురాలు పడాల అరుణ కుమారుడు శరత్‌చంద్ర ఇటీవల మృతి చెందారు. మండల కేంద్రంలో గురువారం ఆమె నివాసం వద్ద సంతాప సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తదితరులు అరుణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం శరత్‌చంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్ఈసీఎస్ సంగతి ఏమైంది..?

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి 105 రోజులు అయ్యింది, స్థానిక ఆర్ఈసీఎస్ సంగతి ఏమైందో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు చెప్పాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ఈపీడీసీలో విలీనమై ఆర్ఈసీఎస్‌ను తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు కళావెంకటరావు ప్రజలకు మాట ఇచ్చారని, కానీ ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎలా గూ గాలిలో కలిసిపోయాయని, కనీసం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను అయినా నెరవేర్చేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఒక్క ఎకరానికి కూడా తోటపల్లి నీరు రాకపోవడం చాలా దారుణమన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రి గా అప్‌గ్రేడ్ చేస్తూ గత ప్రభుత్వం జీఓ తీసుకొచ్చిందని చెప్పారు. అందులో భాగంగానే 24 మంది వైద్యులను నియమించిందని, భవనాలు, ఇతర సదుపాయాల కోసం రూ.29 కోట్లు కూడా మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఇంతలో ప్రభుత్వం మారిందని, ప్రస్తుత పాలకులు ఆస్పత్రి అభివృద్ధి కోసం ఆలోచన చేయడం లేదన్నారు. చిరు ఉద్యోగులను తొలగించడం తప్ప పాలకులకు మరొక పని లేదన్నారు. ప్రభుత్వంలో ఉన్న వారు కక్షసాధింపు చర్యలు మానేసి అభివృద్ధి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాలన సాగించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పతివాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్టు

వేపాడ: మండలంలోని వీలుపర్తి సమీపంలో కోళ్ల పందెం నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వల్లంపూడి ఎస్ఐ బి.దేవి తెలిపారు. వీలుపర్తి గ్రామ సమీ పంలో గురువారం సాయంత్రం కోళ్ల పందెం జరుగుతున్నట్టు సమాచారం అందడంతో సి బ్బందితో కలిసి ఎస్ఐ దేవి దాడులు చేశారు. దాడుల్లో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వా రి నుంచి నాలుగు కోడి పుంజులు, రూ.400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చెరువులు, జలాశయాల్లో ఈతకు దిగొద్దు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ సాయికృష్ణ

గంట్యాడ: చెరువులు, జలాశయాలు, గెడ్డలు పూర్తిగా నీటితో నిండి ఉన్నాయని, వాటిలో ఈతకు దిగవద్దని ఎస్ఐ డి.సాయికృష్ణ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఆయన పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో చదువుకోవాలని, ప్రమాదకర ప్రదేశాల్లో సెల్ఫీలు, రీల్స్ వంటివి చేయకూడదన్నారు. కొత్త ప్రదేశాలకు విహారానికి వెళ్లేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. తెలియని చెరువుల్లో, జలాశయాల్లో ఈతకుదిగి, ప్రాణాల మీదకు తెచ్చుకో వద్దన్నారు.ప్రిన్సిపాల్ జగన్నాథరావు పాల్గొన్నారు.

పెనుబర్తిలో డయేరియా



వైద్య పరీక్షలు చేపట్టాలని వైద్యాధికారులకు ఆదేశాలు జారీచేస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

గుర్ల: మండలంలోని పెనుబర్తిలో డయేరియా విజృంభించింది. గ్రామస్తులు పలువురు డయేరియా బారిన పడి ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతున్నారు. తెట్టంగి పీహెచ్‌సీ సిబ్బంది సకాలంలో స్పందించక పోవడం వల్లే ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. డయేరియాతో ఒకరు మృతి చెందారని గ్రామస్తులు చెబుతుండగా అధికారులు మాత్రం ఇతర అనారోగ్యం వల్ల మాత్రమే మృతి చెందినట్టు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి పెనుబర్తి గ్రామాన్ని గురువారం సందర్శించారు. రోగుల వివరాలపై ఆరా తీశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని తెట్టంగి పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు.

● గ్రామ సందర్శన

జామి, మండలంలోని విజినిగిరి, వేపాడ మండలంలోని ముకుందపురం, దత్తిరాజేరు మండలంలోని పాచలవలస, కొత్తవలస మండలంలోని బీరభద్రపురం,ఎల్.కోట మండలంలోని కళ్లేంపూడి, గరివిడి మండలంలోని దువ్వాం గ్రామాల్లో అధికారులు గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామ సచివాలయాల్లో అధికారులు తనిఖీలు చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార ప్రదర్శనను తిలకించడంతో పాటు గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు.

– జామి/వేపాడ/దత్తిరాజేరు/లక్కవరపుకోట/కొత్తవలస/చీపురుపల్లిరూరల్(గరివిడి)



జామి: విజినిగిరి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు



వేపాడ: ముకుందపురం పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న అధికారులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): దువ్వాం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న అధికారుల బృందం



లక్కవరపుకోట: కళ్లేంపూడిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు



కొత్తవలస: డిఫెన్స్ అకాడమీలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న సీఐ షణ్ముకరావు



శృంగవరపుకోట: చైతన్య కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ ఎస్.వి.మూర్తి



గుర్ల: గుర్ల ప్రధాన రహదారిలో అవగాహన కల్పిస్తున్న సీఐ శంకరరావు



గజపతినగరం: శ్రీభవిష్య జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

కొత్తవలస: విద్యార్థులు, యువత డ్రగ్స్ జోలికి పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని కొత్తవలస సీఐ షణ్ముకరావు హితవు పలికారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 'సంకల్పం' కార్యక్రమం పేరిట స్థానిక భారత్ డిఫెన్స్ అకాడమీలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ కౌమార దశ అత్యంత కీలకమైనదని, ఈదశలోనే జీవితాన్ని మలుచుకోవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అకాడమీ బోధన సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం

శృంగవరపుకోట: స్థానిక చైతన్య జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పోలీసులు గురువారం 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. ఎస్.కోట సీఐ ఎస్.వి.రమణమూర్తి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్‌వాడకం వల్ల చోటుచేసుకునే పరిణామాలను, ఎదురయ్యే పరిస్థితులు, శరీరం, మనసు మీద చూపే ప్రభావాలను వివరించారు. ఎన్‌డీపీ ఎస్ చట్టాలపై అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్ వాడడం వల్ల కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందన్నారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలు, డ్రగ్స్ కంప్లెయింట్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు. ఎస్.కోట ఎస్ఐ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

గుర్ల: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చీపురుపల్లి సీఐ జి.శంకరరావు సూచించారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై మండల కేంద్రంలో ప్రజలు, యువతకు గురువారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేసినా, వినియోగించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎస్ఐ పి.నారాయణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుపైనే దృష్టి పెట్టండి

గజపతినగరం: విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక సీఐ కె.లక్ష్మణరావు సూచించారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీభవిష్య జూనియర్ కళాశాలలో డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా శ్రద్ధగా చదువుకుని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

అభివృద్ధి, సంక్షేమం శూన్యం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

గజపతినగరం: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి వంద రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తే వాటికి వ్యతిరేకంగా పోరాటాలు, రాస్తారోకోలు చేయడమే తమ ప్రధాన కర్తవ్యమని తెలిపా రు. కూటమిగా పోటీచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పేరిట పథకాలను అమలు చేస్తామని ప్రజలకు ఆశ చూపారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక వాటి లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా పక్కన పెట్టేశారని మండిపడ్డారు. ప్రభుత్వంలోని పెద్దలు స్వార్థపూరిత రాజకీయాలు చేస్తూ, సొంత ప్రయోజనాల కోసమే పాటుపడుతున్నారు తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. సాగు నీటి ప్రాజెక్టులన్నీ నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. మెంటాడ మండలంలోని గుర్ల ప్రాజెక్ట్ 20 ఏళ్లుగా అసంపూర్తిగా ఉందని, దానిని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలు మూతపడడం తప్ప కొత్తవి రాలేదని అన్నారు. నిత్యావసర సరకుల ధరలు, పెట్రోల్,డీజిల్ రేట్లు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని, మతాల మధ్య చిచ్చుపెట్టేలా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాసమస్యలపై భవిష్యత్‌లో పోరాటాలు చేస్తామని చెప్పారు.

మహాసభలను విజయవంతం చేయండి

సీపీఎం 10వ జిల్లా మహాసభలను నవంబర్ 9,10వ తేదీల్లో గజపతినగరంలోని శ్రీలక్ష్మీనారాయణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నామని తమ్మినేని తెలిపారు. మహా సభలను పార్టీ శ్రేణులు, ప్రజలు విజయ వంతం చేయాలని కోరారు. అనంతరం సంబంధిత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, తొత్తడి వెంకటరమణ, వి.లక్ష్మి, జి.శ్రీనివాసనాయుడు, రాకోటి రాములు తదితరులు పాల్గొన్నారు.